**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**తేది : 16 ఏప్రిల్, 2022.**

ఈ రోజు విజయవాడలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు గారి అధ్యక్షతన జరిగిన సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి సమావేశం ఆమోదించిన తీర్మానాన్ని ప్రచురణార్థం పంపుతున్నాము.

## ప్రజాపంపిణీ వ్యవస్థలో నగదు బదిలీని రద్దు చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి సమావేశం తీర్మానం

ఆహార భద్రతను దెబ్బతీసే నగదు బదిలీ పథకాన్ని రద్దు చేసి అర్హులందరికీ చౌక డిపోల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు అందజేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

ఈ నెల 25 నుండి రాష్ట్రంలో 5 మున్సిపాలిటీలలో (గాజువాక, అనకాపల్లి, కాకినాడ, నరసాపురం, నంద్యాల) నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈ నెల 16వ తేదీ నుండి 23వ తేదీ వరకు లబ్ధిదారులతో అంగీకార పత్రాలు తీసుకుని 25 నుండి అమలు చేయాలని నిర్ణయించింది. పేదలకు ఇస్తున్న సబ్సిడీలను పూర్తిగా కుదించడానికే ఈ నగదు బదిలీ పథకం. కేంద్ర బిజెపి ప్రభుత్వం గ్యాస్ సిలెండరుకు రు.600 సబ్సిడీ ద్వారా నగదు బదిలీ చేస్తామని ప్రారంభంలో చెప్పింది. క్రమేపీ బహిరంగ మార్కెట్ ధరలతో ముడిపెట్టి ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని పూర్తిగా తగ్గించి నేడు సిలిండరుకు రు.3 నుండి రు.10 మాత్రమే సబ్సిడీ ఇచ్చి రు.350కు ఇస్తున్న వంట గ్యాస్‌ను రు.1000లకు పెంచి బిజెపి ప్రభుత్వం ప్రజలకు తీవ్రమైన ద్రోహం చేసింది. రేపు ప్రజాపంపిణీ వ్యవస్థలో కూడా ఇదే జరుగుతుంది.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అంగీకారం మేరకే నగదు బదిలీని అమలు చేస్తామని చెబుతోంది. దీంతోపాటు కేంద్ర ఆహార భద్రతాచట్టం ద్వారా లబ్ధి పొందుతున్న వాళ్ళు నగదు బదిలీకి రావాలంటే ఆహార భద్రత చట్టం నుండి బయటకు వస్తేనే నగదు బదిలీకి అర్హులని చెబుతున్నారు. ఇది పాడి గేదెను వదులుకొని రావడం లాంటిది. ప్రజలు తెలియక మోసపోయి అంగీకరించిన తరువాత ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని అనివార్యంగా తగ్గిస్తారు. అంతేగాకుండా బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలకు నగదు బదిలీకి ఎటువంటి సంబంధం ఉండదు. ఉదాహరణకు ప్రస్తుతం మార్కెట్ ధరలతో నిమిత్తం లేకుండా రూపాయికే కిలో బియ్యం పేదలకు అందుతుంది. రేపు బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రు.60 లకు పెరిగితే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మాత్రం 12 రూపాయలే ఉంటుంది. అంటే రూపాయికి కూడా బియ్యం పొందే పేదలు 42 రూపాయలు పెట్టి కొనాల్సి వసుంది. ఈ కారణంగా పేదలకు రేషన్ షాపు ద్వారా బియ్యం అందక, ప్రభుత్వం నుండి సహాయం అందక మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యావసర సరుకులు కొనలేక అర్థాకలితో అలమటించే పరిస్థితి వస్తుంది.

కేంద్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ, వంట గ్యాస్, విద్యుత్ మొదలగు పేదలకు ఇస్తున్న సబ్సిడీలన్నింటిలో నగదు బదిలీ పథకం ప్రవేశపెట్టి రానురాను కోత విధిస్తూ మొత్తాన్నే రద్దు చేసి పేదలకు తీవ్రమైన ద్రోహం చేయాలని చూస్తోంది. బిజెపి ప్రభుత్వం చట్రంలో పడి వైఎస్సార్‌సిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు నష్టం చేయడానికి సిద్ధం కావడం అన్యాయం.

ప్రజాపంపిణీ కోసం అనివార్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) ద్వారా రైతుల నుండి ధాన్యం సేకరించాల్సి వస్తోంది. ఈ కారణంగా రైతులు ప్రైవేటు మార్కెట్ దోపిడీకి గురికాకుండా ఉండడానికి కొంత వరకైనా దోహదపడుతుంది. రేపు ఈ ప్రజాపంపిణీ వ్యవస్థ దెబ్బతింటే రైతుల ధాన్యం కొనే దిక్కు లేక కార్పొరేట్ సంస్థలు, కాంట్రాక్టర్లు, మధ్య దళారీల దయాదాక్షిణ్యాలకు వదిలేయాల్సి వస్తుంది. ఇప్పటికే రబీలో ధాన్యం కొనలేదు. ఆంధ్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో ధాన్యం అమ్ముడుపోక ఆందోళనలు సాగుతున్నాయి. రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై మరిన్ని ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉంది.

ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రజాపంపిణీ వ్యవస్థను బలహీన పరిచే నగదు బదిలీ పథకాన్ని సిపిఐ(ఎం) వ్యతిరేకిస్తున్నది. నగదు బదిలీ పథకం అమలును నిలిపివేయాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది. అంగీకారపత్రాలు ఇవ్వొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది.

= = =